
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 7

బుధవారం 30 అక్టోబరు 2024



రోడ్డు కుదింపునకు ఆమోదం

- 60 అడుగుల రోడ్డు 30 అడుగులకు ఓకే
- పట్టణం పెరుగుతుంటే రోడ్లు తగ్గడంపై విస్మయం
- భారీగా డబ్బులు చేతులు మారాయన్న అనుమానాలు



లలితా నగర్‌లో రోడ్డును ఆక్రమించి కట్టిని ఇంటి పిల్లర్లను కూలగొట్టిన అధికారులు (ఫైల్)

నంద్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):

నంద్యాల పట్టణం రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అనుకుంటున్న అధికారులు అంతర్గత రోడ్ల వెడల్పు గురించి పట్టించుకోవడం లేదు. గత టౌన్ ప్లానింగ్‌లో ఉన్న రోడ్డును కుదించేందుకు కౌన్సిల్‌లో ప్రతిపాదన ప్రవేశపెట్టారు. దీనికి కౌన్సిల్‌లోని మెజారిటీ సభ్యులు ఆమోద ముద్ర వేశారు. దీనివెనుకు పెద్ద తతంగమే నడించిందని, రోడ్డు కుదింపు ఆమోదముద్ర వేసేందుకు లక్షల రూపాయలు చేతులు మారాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

నంద్యాల పట్టణానికి 30 ఏళ్ల కిందే మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చారు. ఎన్జీఓస్ కాలనీ లలితా నగర్ రోడ్డు 80 అడుగులు ఉండేది. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత పెరుగుతున్న పట్టణ అవసరాల దృష్ట్యా గత ప్రభుత్వం మరోమారు మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా గతంలో 80 అడుగుల రోడ్డును 60 అడుగులకు కుదించింది. ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్డు వెడల్పును ఇంతకంటే తగ్గిస్తే రోడ్డు వాహనదారులకు ఇబ్బంది కలుగుతుంది. గత ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌లో లలితా నగర్ రోడ్డు వెడల్పు 60 అడుగులుగా గత ప్రభుత్వం నిర్ణయించినపుడు మున్సిపాలిటీలోని మెజారిటీ సభ్యులు అభ్యంతరం పెట్టలేదు. అయితే హఠాత్తుగా మాస్టర్ ప్లాన్‌ను కాదని, 60 అడుగుల రోడ్డును 30 అడుగులకు కుదించటం వెనుక ఎవరి హస్తం ఉంది? ఎందుకు ఇలా చేస్తున్నారు? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

మిగతా 8లో



లలితా నగర్‌లో రోడ్డును ఆక్రమించి కట్టిన ఇంటికి నోటీసులు అంటించిన మున్సిపల్ అధికారులు (ఫైల్)

జోరుగా.. హుషారుగా..!

కేఎంసీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కర్నూలు మెడికల్ కళాశాలలో ఉద్భవ-2024 పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆటపాటలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డు అడిషినల్ డీఎంఈ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. వైద్య విద్య ఎంతో ఉన్నతమైనదని, పేద రోగుల ఆరోగ్య ఇబ్బందులు, ప్రాణాలను కాపాడేది ప్రభుత్వ ఆసుపత్రులేనన్నారు. వైద్యవిద్యార్థులు అంకితభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం కొత్త విద్యార్థుల చేత ప్రిన్సిపాల్ హిపోక్రేటిక్ ఓథ్ చేయించారు. విద్యార్థులకు కొత్త యూనిఫారాలను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, సాయిసుధీర్, రేణుకాదేవి పాల్గొన్నారు.



శ్రీశైలంలో చిరుత సంచారం

శ్రీశైలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలోని బస్‌స్టాండ్ ప్రక్కన ఉన్న పంప్‌హౌస్ సమీపంలో ఓ రేకుల షెడ్డు వద్ద చిరుత సంచారం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం రాత్రి సమయంలో అక్కడ గోడపై చిరుత కూర్చొని ఉండగా పలువురు తమ ఫోన్లలో చిత్రీకరించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు స్థానికులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అదేవిధంగా దేవస్థానం పరిధిలోని ఓల్డ్ హెలిప్యాడ్ సమీపంలోని చెక్‌డ్యాం వద్ద కొండచిలువ కనిపించింది. స్నేక్ క్యాచర్ శంకర్ తన బృందంతో కలిసి కొంచిలువను పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.



గోడపై కూర్చున్న చిరుత

వైసీపీ నాయకుడి వీరంగం

- డబ్బులు ఇవ్వాలని అదే పార్టీ కౌన్సిలర్ ఇంటిపై దాడికి యత్నం
- అరెస్టు చేసిన పోలీసులు

డోన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని వైసీపీ నాయకుడు మల్యాల శ్రీనివాసరెడ్డి అదే పార్టీ కి చెందిన కౌన్సిలర్ సాదిక్ ఇంటిపై దాడికి యత్నించాడు. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. స్థానిక కృష్ణార్జున నగర్ కాలనీలో ఉంటున్న కౌన్సిలర్ సాదిక్ ఇంటి మీద సోమవారం రాత్రి వైసీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. వ్యాపార లావాదేవీల్లో తనకు డబ్బులు ఇవ్వాలని, లేదంటే అంతు చూస్తానంటూ శ్రీనివాసరెడ్డి బెదిరించాడు. కౌన్సిలర్ సాదిక్ మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి తన ఇంటిపై దాడి చేశాడని, మహిళలను అవమానించాడని, ఇంట్లో భీభత్సం సృష్టించి భయభ్రాంతులకు గురి చేశాడన్నారు. ఆయనను అరెస్టు చేసిన పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా మాట్లాడుతూ వైసీపీ నాయకుడు మల్యాల శ్రీనివాసరెడ్డి గతంలో రెండు హత్యకేసుల్లో నిందితుడని తెలిపారు.



దివ్వెల సొబగులు

దీపావళి వెలుగులు

జోరుగా మట్టి ప్రమిదల విక్రయాలు

టపాసులతో జాగ్రత్త 8

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్

బంగారం కోసమే ఆర్ఎంపీ హత్య 9

దళారులను నమ్మి మోసపోవద్దు

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కల్పన

నంద్యాల రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కల్పన సూచించారు. మంగళవారం పట్టణంలోని మురారి పవన్ ఆగ్రోటెక్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ నంద్యాల మార్కెట్ పరిధిలో ఉన్న రెండు పత్తి మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. మురారి ఆగ్రోటెక్, ఏఎన్‌సీ మిల్లులను (సిసిఐ) కొనుగోలు కేంద్రాలుగా గుర్తించామన్నారు. ప్రభుత్వం క్వింటం పత్తికి రూ 7521 మద్దతు ధరను ప్రకటించినట్లు పేర్కొన్నారు. రైతులు రైతుసేవా కేంద్రాలలో పేర్లను నమోదు చేసుకుని ఉండాలని, ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంక్ అకౌంట్ నెంబర్ ఇవ్వాలని తెలిపారు. ఆమె వెంట జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహిమాన్, మార్కెట్ సహాయ కార్యదర్శి శేషిరెడ్డి, సూపర్‌వైజర్లు సుబ్రమణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలే లక్ష్యం

నేర సమీక్షలో డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

నంద్యాల క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా పోలీసులకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశానికి హాజరైన డీఐజీకి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబులు పూలమొక్కలతో స్వాగతం పలకగా జిల్లా సాయుధ బలగాలు గౌరవ వందనం చేశాయి. అనంతరం కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో డీఐజీ, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నేర సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ నంద్యాల జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, డోన్ సబ్ డివిజన్లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. సబ్ డివిజన్ల వారీగా పోలీస్ స్టేషన్లలో కేసుల పెండింగ్‌కు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిం చుకుని కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలు, పట్టణాల్లో అల్లరిమూకలు, ఫ్యాక్షన్ చరిత్ర వున్న వారిపై నిఘా పెంచాలన్నారు. అవసరమైతే ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి నేర ఘటనలు పునరావృతం కాకూడదని, అవసరమైతే రౌడీషీట్లు ఓపెన్ చేయాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపరచుకోవాలని, స్టేషన్లకు వచ్చేవారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నివారణకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచినవారికి ప్రతిభాపురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు.



జిల్లా సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ కోయప్రవీణ్

అనంతరం సబ్ డివిజన్ల వారీగా ఉత్తమ ప్రతిభ కనబరచినవారికి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచినవారిలో నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త, సీసీఎస్ సీఐ పి.సురేష్‌కుమార్, శ్రీశైలం వన్‌టౌన్ సీఐ ప్రసాదరావు, డోన్ టౌన్ సీఐ ఇంతియాజ్‌బాష, ఆర్మ్‌డ్ రిజర్వ్ సీఐ మంజునాథ్, ఫింగర్‌ప్రింట్ ఎస్ఐ భరత్, ఆర్ఎస్ఐ దాదాపీరా, ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ ఇబ్రహీం, కానిస్టేబుల్ వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ శాంతిరెడ్డి మల్లికార్జున, డోన్ రూరల్ కానిస్టేబుల్ సురేష్, టౌన్ కానిస్టేబుల్ హరి, అవుకు కానిస్టేబుల్ జిలాని, నందికొట్కూరు కానిస్టేబుల్ చిన్నచెన్నయ్య, పరశురాముడు తదితరులు న్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రామా ంజినాయక్, శ్రీనివాసులు, రవికు మార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



బోర్డు మీటింగ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామనీ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం అమరావతిలో సీడ్స్ కార్పొరేషన్ కార్యాలయంలో మొదటిసారి బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా రైతులకు విత్తనాల కొరత రాకుండా కృషి చేస్తామన్నారు. తంగడెంచ విత్తనోత్పత్తి క్షేత్రంను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి విత్తనాల టెండర్లు, కంపెనీ షేర్లు, ఉద్యోగుల డీఏ రెండు విడతలు తదితర అంశాలపై బోర్డు మీటింగులో చర్చించడం జరిగిందని సుబ్బారెడ్డి తెలిపారు.

మంత్రి బీసీని కలిసిన టీడీపీ యువ నాయకులు : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని డోన్ నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బనగానపల్లెలోని మంత్రి స్వగృహంలో బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఏఎస్ఐలకు పదోన్నతి

కర్నూలు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రేంజ్ పరిధిలో 11 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన నలుగురు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఏడుగురికి పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన వారు మంగళవారం డీఐజీ కార్యాలయంలో డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరంతా 1990 బ్యాచ్‌కు చెందిన వారు. పదోన్నతులు రావడం అభినందనీయమని, విధుల్లో మంచి ప్రతిభ కనబరచాలని డీఐజీ ఆకాంక్షించారు.

ఇన్‌చార్జిల పాలన

- ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీ
- పెద్ద దిక్కులేక గాడి తప్పిన యంత్రాంగం
- జోడు పదవుల్లో తూతూ మంత్రంగా బాధ్యతలు
- ఇన్‌చార్జిలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఉద్యోగులు



జిల్లా పరిశ్రమల కేంద్రం



ఆటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యాలయం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని తూతూ మంత్రంగా ఇన్‌చార్జిలతో నింపేశారు. ఫలితంగా పాలన గాడి తప్పి పౌరసేవలు, ప్రజాసంబంధాలు, కార్యాలయ కార్యకలాపాలు అటకెక్కాయి. ఏ పని ముందుకు సాగాలన్నా ఇన్‌చార్జి అనే కారణంతో వాటిని పట్టించుకోవడం లేదు. బాధ్యతలు చేపట్టిన అధికారులు అతిథి పాత్రలతో ద్విపాత్రాభినయం చేస్తుండటంతో శాఖల్లో పారదర్శక పాలన లోపించి, అటు ఉద్యోగులు, ఇటు కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతకాల నుంచి చిన్నపాటి అనుమతుల వరకు వేచి చూసే ధోరణి ఉండటంతో చాలా పనుల్లో జాప్యం జరుగుతోంది.

- రాష్ట్ర ప్రభుత్వం ఆడవుల పెంపకం, వాటి సంరక్షణ, వన్యప్రాణుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో అత్యంత కీలకమైన కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు స్థానాన్ని ఇన్‌చార్జిలకు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఎఫ్ రామకృష్ణ సాధారణ బదిలీల్లో భాగంగా 20 రోజుల క్రితం బదిలీ కాగా, అనంతపురం సీఎఫ్‌గా నియమితులయిన యశోదబాయికు కర్నూలు సీఎఫ్‌గా అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసలే మూడు జిల్లాల పరిధిలో విధుల నిర్వర్తించాల్సిన ఆమెకు, కర్నూలు ఇన్‌ఛార్జి బాధ్యతలతో ఆరు జిల్లాల విధులు భారంగా మారాయి. దీనికి తోడు సీఎఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారిక పర్యటన నిమిత్తం యశోదబాయి విదేశాలకు వెళ్లటంతో ఆ బాధ్యతలను జిల్లా అటవీ అధికారికి శ్యామలను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈమెకు సైతం ఈ బాధ్యతలు అదనపు భారంగానే మారాయి.

మిగతా 8లో..

దివ్వెల సొబగులు.. దీపావళి వెలుగులు





- నగరంలో జోరుగా మట్టి ప్రమిదల విక్రయాలు
- విభిన్న రూపాల్లో వినూత్న డిజైన్లు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వస్తుందంటేనే ఇళ్లంతా దీప కాంతులతో నిండిపోతుంది. మహిళలు ఇంటి ముందు దీపాలు వరుస క్రమంలో వెలిగించి, దీపావళి లక్ష్మిని తమ ఇంటికి ఆహ్వానం పలుకుతారు. మూడు రోజులపాటూ నిర్వహించుకునే దీపావళి వేడుకలో ప్రధానంగా ఇళ్ల ముందు వెలిగించే మట్టి ప్రమిదలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. కొత్త మట్టి ప్రమిదలను తెచ్చుకొని, వాటిని బాగా కడిగి ఆరబెట్టి, అందులో ఒత్తులు, నూనె వేసి ఉదయం, సంధ్యా వేళల్లో వెలిగించడం తెలుగింటి సంప్రదాయం. మరో గురువారం దివ్వెల వేడుక దీపావళితో పాటు మరోవైపు నవంబరు 4 నుంచి కార్తీక మాసం ఆరంభం అవుతోంది. ఈ నేపథ్యంలో మట్టి ప్రమిదలకు ఆదరణ పెరిగింది. నగరంలో వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో వ్యాపారులు మట్టి ప్రమిదలు విక్రయాలు చేస్తుండగా, మహిళలు వీటి కొనుగోలుపై ఆసక్తి చూపిస్తున్నారు. నగరంలో సి.క్యాంపు, మద్దూర్‌నగర్, నంద్యాల చెక్‌పోస్టు, మెడికల్ కళాశాల రోడ్డు, పెద్దమార్కెట్, వెంకటరమణ కాలనీ, పంప్‌హౌస్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు వీటిని విక్రయిస్తున్నారు.

విభిన్న రూపాలు...వినూత్న డిజైన్లు

ఒకప్పుడు సాధారణ రూపంలోనే మట్టి ప్రమిదలు లభించేవి. నేడు మారుతున్న కాలానుగుణంగా విభిన్న రూపాలు, వినూత్న డిజైన్లలో ఇవి లభిస్తున్నాయి. గతంలో నల్ల మట్టితో తయారు చేసిన మట్టి ప్రమిదలే లభించేవి. కానీ నేడు ఎర్రటి టెర్రాకోట మట్టితో తయారు చేసిన ప్రమిదలను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ టెర్రాకోట మట్టితో తయారైన ప్రమిదలను కళాకారులు విభిన్న కళాకృతులు ఒట్టిపడేలా రూపొందిస్తున్నారు. ఇవి సైజుల అనుసారంగా డజను రూ.30 నుంచీ 200 వరకు ధరలు పలుకుతున్నాయి. వీటిలో ఇంట్లో పూజ గదిలో వెలిగించేవీ, తులసి కోటల వద్ద, ఇంటి ప్రధాన ద్వారాల వద్ద, గోడలపై బారులుగా పెట్టే ప్రమిదలు అందుబాటులో లభిస్తున్నాయి. ఇక ఇళ్లకు ప్రత్యేక ఆకర్షణగా వేలాడే దీపాలు కూడా అమ్మకాలు చేస్తున్నారు.



కుమ్మరులకు ఆదరణ తగ్గింది



గతంలో కుమ్మరులు చేసే ప్రమిదలకు బాగా ఆదరణ ఉండేది. కానీ నేడు కుమ్మరుల స్థానంలో ఇతర కులాల వారు వచ్చి వీటిని అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వృత్తిపరంగా జీవనోపాధిగా బతికే మాకు ఉపాధి కరువైంది. అటు వారికి పెద్దగా ఆదరణ లేదు. పైగా రోడ్లపై చాలామంది ఇవే అమ్మకాలు చేస్తుండటంతో కొనుగోలుదారులు బేరాలు ఆడి వెళ్లిపోతున్నారు. ఇతర వృత్తుల్లోకి వెళ్లలేక, మట్టినే నమ్ముకొని వ్యాపారం చేస్తున్నాం.

\- కె.మధు, ప్రమిదల వ్యాపారి



నీటితో వెలిగే దీపాలు!



మార్కెట్‌లో నీటితో వెలిగే దీపాలు అందుబాటులోకి వచ్చేశాయి. నూనె అవసరం లేకుండా కేవలం నీరు పోయడం ద్వారానే ఇవి వెగులుతూ ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ తో రూపొందించిన ఈ దీప ప్రమిదలు వాటి కింది భాగంలో చేతి గడియారాల్లో ఉపయోగించే చిన్న బ్యాటరీని అనుసంధానం చేశారు. ఈ బ్యారిటీకి పైన ఇచ్చిన రెండు సన్నటి తీగలకు నీళ్ల తగిలిన వెంటనే ఇవి వెలుగుతూ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఇవి స్థానిక వ్యాపారులు ఒక్కో ప్రమిద రూ.40 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ మార్కెటిం గ్‌లోనూ ఇవి అందుబాటులో ఉన్నాయి.

టపాసులతో జాగ్రత్త

ఆదోని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. చిన్నాపెద్ద అంతా కలిసి బాణాసంచా కల్చుతూ ఆనందాన్ని పొందుతారు. ఇంతా సరదాగా జరుపుకునే పండుగలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా అది తీరని విషాదాన్ని నింపుతుంది. మరి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా దీపావళి ప్రశాంతంగా జరుపుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక శాఖ అధికారులు, డాక్టరులు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

- ఆయిల్ క్యాన్లు, గ్యాస్ సిలిండర్లు తదితర మండే పదార్థాలకు దూరంగా పెట్టాలి.
- నైలాన్ దుస్తులు ధరించి బాణసంచా పేల్చవద్దు. ఈ వస్త్రాలకు మంటలు త్వరగా అంటుకునే స్వభావం ఉంటుంది. నూలు, ఖద్దరు బట్టలను మాత్రమే ధరించాలి.
- టపాసులు కాల్చటానికి పొడవాటి క్యాండిల్, అగర్‌బత్తి ఉపయోగించాలి. చేతిని పూర్తిగా చాపి టపాసులను ముట్టించాలి.
- గాలి వీస్తున్నప్పుడు రాకెట్లు, పైకి ఎగిరేవి కాల్చవద్దు.
- కాల్చిన బాణసంచాను నీరు నింపిన బకెట్‌లో వేయాలి.
- బకెట్ నిండా నీటిని, దుప్పట్లను సిద్ధంగా ఉంచుకోవాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్ దగ్గర ఉంచుకోవాలి.
- వాహనాల వద్ద ఇళ్లలో టపాసులు కాల్చకూడదు.
- ప్రజలు భారీగా శబ్దం చేసే బాణసంచాను కాల్చకుండా.. పర్యావరణహిత టపాసులను మాత్రమే వినియోగించాలి.
- చిన్నారులు టపాసులు వేసేటప్పుడు వారిని ఒంటిరిగా వదలకూడదు
- మరోవైపు టపాసులు కాల్చేటప్పుడు అజాగ్రత్తగా ఉండడం వల్ల కంటికి గాయాలతో ఏటా పదుల సంఖ్యలోనే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు అత్యవసర చికిత్స కోసం వస్తుంటారు.
- ప్రమాదకరమైన బాణసంచా జోలికి వెళ్లకూడదు.
- బాణసంచాతో ప్రయోగాలు చేయకండి. పొగ ఎక్కువగా వచ్చే వాటిని వాడకండి.
- విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగల వద్ద టపాసులు పేల్చవద్దు.
- మందుగుండు కాల్చుతున్నప్పుడు ముఖం దగ్గరగా పెట్టకూడదు.
- బాణసంచా కాల్చే సమయంలో కళ్లకు అద్దాలు ధరించడం వల్ల రవ్వలు పడకుండా చూసుకోవచ్చు.
- ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్‌లను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. **ఉదా:** ఫైర్ ఇంజన్ 101, అంబులెన్స్ 108.

ఇన్‌చార్జిల పాలన

(7వ పేజీ తరువాయి)

ఇదే శాఖల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ ఫారెస్టు అధికారి స్థానం గత కొన్ని నెలలుగా ఇన్‌చార్జితోనే కొనసాగిస్తున్నారు. డోన్ సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారిగా ఉన్న సూర్యచంద్రరాజుకు అదనంగా ఈ బాధ్యతలు ఇచ్చారు. ఫలితంగా తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. అటవీ భూముల్లో ఇసుక తవ్వకాలు, తరలింపు, అటవీ ఉత్పత్తుల అక్రమ రవాణాలోను నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

- కర్నూలు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ప్రాంగణంలోనే జోనల్ కార్యాలయం కొలువు తీరి ఉంది. ఇక్కడ మూడు జిల్లాకు సంబంధించి జాయింట్ చీఫ్ ఎన్విరాన్ మెంట్ ఇంజనీరు(జేసీఈఈ) ఉంటారు. నెల రోజుల క్రితం జేసీఈఈ ప్రసాద్ పదవి విరమణ పొందారు. ఈ నేపథ్యంలో విజయవాడ జేసీఈఈగా విధులు నిర్వర్తిస్తోన్న మునిస్వామి నాయుడుకు కర్నూలు జేసీఈఈగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఈయన వారం రోజులు విజయవాడ కేంద్రంగా, మరో వారం రోజుల పాటు కర్నూలు కేంద్రంగా పని చేస్తున్నారు. దీంతో పరిపాలనాపరమైన అంశాల్లో తీవ్ర ఆసౌకర్యం కలుగుతోంది. కింది స్థాయి అధికారుల మీద కూడా పర్యవేక్షణ కొరవడింది. జేసీఈఈ సైతం మొక్కుబడిగా వారం రోజులు ఇక్కడ హాజరవుతూ వారాంతంలో విజయవాడకు వెళ్లిపోతున్నారు. దీని వల్ల ఉద్యోగుల్లో బాధ్యతరాహిత్యం నెల కొంది. కింది స్థాయి అధికారులకు సరైన మార్గనిర్దేశం చేయ కపోవటంతో ఆసుపత్రుల్లో, నీరు, వాయువు పరీక్షలు, బయో వేస్టు మెడికల్ వ్యర్థాల పరిశీలన, సంబంధిత ఆసుపత్రుల తనిఖీ, అనుమతులపై పర్యవేక్షణ లేకుండా పోయింది.
- రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది కానీ ఈ శాఖలో శాశ్వతంగా ఉన్నతాధికారి లేక ఏడాది కావస్తోంది. గతంలో ఇన్‌చార్జిగా పనిచేసిన సిద్ధలింగమూర్తి బదిలీపై వెళ్లటంతో ఆయన స్థానంలో హెచ్ఎస్ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. మాతృసంస్థలోనే పనిభారంతో సతమతమయ్యే వీరు అదనపుశాఖల పట్ల అయిష్టంగా పనిచేస్తున్నారు. వాస్తవానికి వంద రోజుల ప్రణాళికలో భాగంగా డిసెంబరు నెలాఖరు నాటికి 6672 ఇళ్లు పూర్తి కావాల్సి ఉండగా, ఇన్‌చార్జిల పుణ్యమాని పనులు నత్తనడకన నడుస్తున్నాయి.
- జిల్లా పరిశ్రమల కేంద్రంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న మారుతీ ప్రసాద్ గత నెలలో నెల్లూరు జీఎంగా బదిలీపై వెళ్లారు అయన స్థానంలో నెల్లూరు నుంచి సుధాకర్ జీఎంగా కర్నూలుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన మర్నాడే ఆయన సెలవుపై వెళ్లిపోయారు. ఆయన సెలవు పెట్టి 20 రోజులు దాటడంతో పాలనపరమైన వ్యవహారాలు స్తంభించిపోయాయి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అటకెక్కిందనే చెప్పాలి. ఉన్నతాధికారి లేకపోవటంతో ఉపసంచాలకులుగా ఉన్న ఆరుణకు ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. కానీ ఇన్‌చార్జి కావటంతో ఎవరైనా పౌరసేవల నిమిత్తం కార్యాలయానికి వచ్చినా సరిగ్గా స్పందించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏది అడిగినా ఉన్నతాధికారి సెలవులో ఉన్నారు, ఆయన వచ్చాక కలవమని దాటవేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆసౌకర్యానికి గురి అవుతున్నారు.



సీఎఫ్ బదిలీ అయినా తొలగించని నేమ్ ప్లేట్



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం

రోడ్డు కుదింపునకు ఆమోదం



లలితా నగర్‌లోని ఓ వీధి

(7వ పేజీ తరువాయి)

నంద్యాలకు ఓ వైపు చెరువు, మరోవైపు కుందూ నది ఉండటంతో ఇంటి నిర్మాణాలకు అనువైన ప్రాంతాల్లో ఎన్జీఓస్ కాలనీ అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ సెంటు భూమి విలువ దాదాపు రూ.20 లక్షల పైనే ఉంటుంది. దీంతో ఎన్జీవోస్ కాలనీ లలితా నగర్‌లోని రోడ్డు కొన్ని చోట్ల 60 అడుగులు ఉంటే మరికొన్ని చోట్ల 30 అడుగులు మాత్రమే ఉంది. ఈ లెక్కన ఇక్కడి ఇంటి నిర్మాణాలు ఎంత అక్రమంగా ఉన్నదీ తెలుస్తుంది. అయినా 60 అడుగుల రోడ్డును 30 అడుగులకు కుదించేలా మున్సిపల్ కౌన్సిల్‌లో మంగళవారం ఆమోద ముద్ర వేశారు.

ఎంత డబ్బు చేతులు మారింది..?

మూడు నెలల కిందట లలితా నగర్‌లోని ఓ వ్యక్తి మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకకంగా, రోడ్డును ఆక్రమిస్తూ కడుతున్న ఇంటి నిర్మాణాన్ని తొలగించారు. దీంతో ఇక్కడి కొందరు మున్సిపాలిటీలోని ముఖ్య ప్రజాప్రతినిధులను కలిశారు. మీ ఇళ్లకు తన భరోసా ఉంటుందని అన్నారు. అయితే ఈ విషయంలో దాదాపు రూ. కోటిపైనే చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డబ్బులు చేతులు మారాయి



లలితా నగర్ రోడ్డును మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా కుదించడం పూర్తిగా అక్రమం. 60 అడుగుల రోడ్డును 30 అడుగులకు కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారాయి. ఇందులో ఎవరెవరికి ఎంత వాటా ఉందో తెలాలి.

\- మాబువలీ, టీడీపీ ఫ్లోర్ లీడర్, నంద్యాల.

ఐసీఐసీఐ బీమా కంపెనీకి వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాలసీదారుడు మృతి చెందిన తర్వాత నామినీకి బీమా మొత్తం చెల్లించని ఐసీఐసీఐ బీమా సంస్థను జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. నందికొట్కూరు మండలానికి చెందిన కాశపోగు చిన్న నాగన్న 2021లో రూ.5 లక్షలకు ఒక జీవిత బీమా పాలసీని తీసుకున్నాడు. ఆయన 2022లో అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ పాలసీలో నామినిగా ఉన్న అతని కుమారుడు శ్రీకాంత్ పాలసీ మొత్తం కోసం ఐసీఐసీఐ బీమా సంస్థకు క్లెయిమ్ దరఖాస్తు చేసుకున్నాడు. అయితే.. పాలసీదారుడు తన ఆదాయం రూ. లక్ష ఉన్నా కూడా ఎక్కువ చూపెట్టి పాలసీ పొందాడని చెబుతూ బీమా సంస్థ ఆ క్లెయిమ్ దరఖాస్తును తిరస్కరించింది. దీంతో శ్రీకాంత్ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కేసును విచారించిన కమిషన్ పాలసీదారుడి ఆదాయం ఏడాదికి రూ.లక్ష పైనే ఉన్నట్లు సాక్షాధారాలు ఉన్నాయని, ఫిర్యాదీకి బీమా మొత్తం చెల్లించకపోవడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. ఐసీఐసీఐ బీమా సంస్థ ఫిర్యాదీకి పాలసీ మొత్తం రూ.5 లక్షలను 9శాతం వడ్డీతో పాటు అదనంగా మరో రూ.15వేలను కోర్టు ఖర్చులు, నష్టపరిహారం కింద చెల్లించాలని ఆదేశిస్తూ కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్లు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

మత్తు పదార్థాల నివారణే లక్ష్యం

జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా పిలుపునిచ్చారు. మంగళశారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి జిల్లా సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ బిందుమాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగిస్తే వాటి వల్ల జీవితం ఏ విదంగా నాశనం అవుతుందనే వీడియోలను పాఠశాల, కళాశాల విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించాలని డీఈవోను ఆదేశించారు. ఇంజనీరింగ్; మెడికల్ కళాశాలలో తప్పనిసరిగా తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. ఎస్పీ జి. బిందుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు 96 కేసులు నమోదయ్యాయన్నారు. 65 కేసులు పెండింగ్, ట్రయల్‌లో ఉన్నాయని, 10 కేసులు చార్జిషీట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 18 కేసులు ఇంకా విచారణలో ఉండగా వీటిలో 12 కేసులకు సంబంధించి విచారణలో ఉన్నాయన్నారు. 2024లో ఏడు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

సహాయ సహకారాలు అందిస్తాం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండ ర్లకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరి యంలో ట్రాన్స్‌జెండర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లందరికీ గుర్తింపు కార్డులతో పాటు అర్హులైలకు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్, ఓటరు కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలని అదికారులను ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లలో నైపుణ్యత ఉన్న వారు సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు బ్యాంకు రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్, కార్పొరేషన్ల అదికారులను ఆదేశించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను ఎవరైనా వేధించినా, దుర్భాషలాడినా ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్‌వో డా. భాస్కర్, విభిన్న ప్రతిభావంతుల ఏడీ రయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా మంగళవారం సాయంత్రం సూపరింటెండెంట్ చాంబరులో బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి మధ్యాహ్నం ఉత్తర్వులు రావడంతో ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. కొత్త సూపరింటెండెంట్‌కు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కే.చిట్టినరసమ్మ, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, కేఎంసీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో శ్రీనివాసులు, ఆఫీసు సూపరింటెండెంట్ కుమారస్వామి, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాయలసీమలోనే అతి పెద్దాసుపత్రిగా పేరొందిన కర్నూలు జీజీహెచ్ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. సెక్యూరిటీ, పారిశుధ్యం పనులపై ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.



కొత్త సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్

బంగారం కోసమే హత్య

- ధ్రువీకరించిన సీఐ
- ముగ్గురు నిందితుల అరెస్టు
- బంగారం, ఆయుధాలు, మోటార్‌సైకిల్ స్వాధీనం


నిందితులను మీడియాకు చూపుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ ఎల్లాల కొండయ్య దారుణ హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. మృత దేహం జీఎన్‌ఎస్‌ఎస్‌లో బయటపడిన రోజు ఆంధ్రజ్యోతి రాసిందే అక్షర సత్యంగా నిర్ధారితమైంది. మృతుడు కొండయ్య ఒంటిపై ఉన్న బంగారం కోసమే బెలుం శింగవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు, వారి కుమారుడు ఈ హత్యకు ఒడిగట్టినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు మీడియాకు వివరించారు. మంగళవారం బెలుం శింగవరం గ్రామానికి చెందిన ధనపాటి ఆనందరెడ్డి, మహేశ్వరమ్మ వృద్ధ దంపతులను, వారి కుమారుడు శ్రీనాథరెడ్డిని అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. వారి నుండి మృతుడు కొండయ్యకు చెందిన బంగారు గొలుసు, ఉంగరాలతో పాటు, దాడికి ఉపయో గించిన ఆయుధాలు, మృత దేహాన్ని తరలించడానికి ఉపయోగించిన బైకును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. శ్రీనాథరెడ్డి తీవ్ర అప్పుల్లో కూరుకుపోయి డబ్బు అవసరం కోసం కొండయ్య ఒంటిపై ఉన్న బంగారం కాజేయాలని పథకం ప్రకారమే హత్య చేశాడని సీఐ తెలిపారు.

శ్రీనాథరెడ్డి ఈనెల 25న మధ్యాహ్నం ఆర్‌ఎంపీ కొండయ్యకు ఫోన్‌చేసి తన తండ్రికి ఒంట్లో బాగాలేదని, వైద్యం చేయడానికి రావాలని పిలిచాడు. కొండయ్య మందుల బ్యాగు తీసుకొని స్కూటీపై వృద్ధ దంపతులు ఉన్న తోట వద్దకు వెళ్లాడు. చికిత్స చేస్తున్న సమయంలో వెనుక నుంచి ఆర్‌ఎంపీ కొండయ్యపై శ్రీనాథ రెడ్డి సేద్యానికి ఉపయోగించే మేడితాకతో దాడి చేసి, హత్య చేశాడన్నారు. ఒంటిపై ఉన్న బంగారం తీసుకొని, అదే రోజు రాత్రి బైక్‌పై పక్కనే ఉన్న గాలేరు నగరి కాలువలో శవాన్ని స్కూటీని వేశాడన్నారు. 26న ఉదయం మృతదేహం కాలువలో లభ్యమైందన్నారు. స్కూటీ కోసం గాలిస్తున్నామ న్నారు. కేవలం రెండున్నర తులాల బంగారం కోసమే ఆర్‌ఎంపీని హత్య చేసినట్లు నిందితులు అంగీకరించారని సీఐ రమేష్‌బాబు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- కొడుకు, కూతురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూతురును కర్నూలులో స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్ష రాయించేందుకు వెళ్తుండగా లింగందిన్నె క్రాస్ రోడ్డు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కుమ్మరి హేమాంద్రి(38) మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం జరిగింది. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకండ్ల గ్రామానికి చెందిన హేమాంద్రి తన కూతురు త్రివేణిని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాయించేందుకు సోమవారం కొనకండ్ల నుంచి కర్నూలుకు బయలుదేరారు. పత్తికొండలో హేమాంద్రి స్నేహితుడు ఉండటంతో రాత్రి ఉండి మంగళవారం ఉదయం స్నేహితుడి కారు (ఏపీ21సీఈ8551)తీసుకొని కూతురు, కుమారుడితో కర్నూలుకు బయలుదేరారు. మార్గమధ్యంలో లింగందిన్నె క్రాస్ రోడ్డు దగ్గర పక్కవైపు నుంచి అతి వేగంగా వచ్చిన లారీ(టీఎస్ 12ఈక్యూ 9558) రోడ్డుపై వెళుతున్న కారును వెనుక వైపు ఢీ కొట్టింది. అందులో ఉన్న హేమాంద్రి తలకు, భుజానికి తీవ్రగాయాలై తీవ్రరక్తస్రావం జరిగింది. కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హేమాంద్రి మృతి చెందాడు. కూతురు, కుమారుడు, కారుడ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుని భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ కాంగ్రెస్ కార్యాలయంలో నంద్యాల జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఆర్డినేటర్ పలక్‌వర్మ సమీక్ష నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ జిల్లాల వారీగా కాంగ్రెస్ బలోపేతానికి సమావేశాలు నిర్వహించడం, కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి దారితీస్తుందన్నారు.

నంద్యాల జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులు సమన్వయంతో పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధిస్తుం దన్నారు. పార్టీకోసం పనిచేసేవారికి ప్రాధాన్యముంటుదన్నారు. నంద్యాల పార్లమెంటులో బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు అధిక సంఖ్యలో ఉన్నారని, నియోజకవర్గ కో ఆర్డినేటర్లను నియమిస్తే వారి సమన్వయంతో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయనున్నట్లు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీఖాన్, అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

లారీ, మినీ వాహనం బోల్తా..

డోన్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం లారీ, ఓ మినీ వాహనం బోల్తా పడింది. ఈ సంఘటన చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బెంగుళూరు నుంచి హైదరాబాదు వైపునకు వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీ ఆయిల్ ట్యాంకర్ వెళ్తున్న వాహనం, టెంకాయల లోడుతో వెళ్తున్న మినీ వాహనం డోన్ హైవే రోడ్డుపై వెళ్తూ ఒకదానికి ఒకటి క్రాసింగ్ చేసే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పట్టణ పోలీసులు తెలిపారు. టెంకాయల లోడుతో వెళ్తున్న మినీ వాహనం, తమిళనాడు చెందిన లారీలు అదుపు తప్పి బోల్తా పడ్డాయి. అదే సమయంలో ముందు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ రోడ్డు దాటి రూరల్ పోలీస్ స్టేషన్ వైపున దూసుకెళ్లి ఆగిపోయింది. ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. భారీ ప్రమాదం తప్పడంతో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా క్రేన్ సాయంతో బోల్తా పడిన వాహనాలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన వాహనం

సమస్యలు పరిష్కరించండి

డ్వామా ఇన్‌చార్జి పీడీకి నాయకుల వినతి

కర్నూలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు జిల్లా టెక్నికల్ అసిస్టెంట్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు యు.తిరుమలేశ్ కోరారు. మంగళవారం డ్వామా ఇన్‌చార్జి పీడీ నాసరరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజకీయ ఒత్తిళ్లను ఇన్‌చార్జి పీడీకి వివరించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు పని ఒత్తిడి, చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రాజకీయాలు కారణాలతో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను లక్ష్యంగా చేసుకుని సామాజిక తనిఖీల పేరిట టెక్నికల్ అసిస్టెంట్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. గ్రామ స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి మండల స్థాయిలో ఎంపీడీవోల వరకు బాధ్యత ఉందని, ఏ సమస్య వచ్చినా ఎస్‌ఆర్‌డీఎస్-2012 రూల్స్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మధుశేఖర్, కోశాధికారి బషీర్ అహ్మద్, నాయకులు ఎం.ఆనంద్, సువర్ణలత, జ్యోతి, రేణుక, మల్లికార్జున, మహేష్ పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న టెక్నికల్ అసిస్టెంట్స్ నాయకులు

31లోగా నవోదయకు దరఖాస్తు చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరే విద్యార్థులు అక్టోబరు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి మంగళవారం తెలిపారు. 9వ తరగతి అభ్యర్థులు 2024-25లో 8వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతూ ఉండాలన్నారు. అలాగే 11వ తరగతి విద్యార్థులు సైతం 2024-25వ సంవత్సరంలో 10వ తరగతి ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతుండాలన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. చివరి తేదీ అక్టోబరు 30 ఉండగా ఎంపిక పరీక్ష 08-02-2025 శనివారం ఉంటుందన్నారు. వివనాలరే ఫోన్ 08512-294545లో సంప్రదించాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సలీం నగర్‌కు చెందిన ఫరూక్ (33) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఫరూక్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న వేదపండితులు

మహానంది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని రాతి నందీశ్వరుడికి మంగళవారం సాయంత్రం వేదపండితులు ప్రదోషకాల పూజలు నిర్వహించారు. ప్రధాన గర్భాలయంలోని రాతి నందీశ్వరుడికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం, ప్రదోషకాల పూజలు వేదపండితుడు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

2 నుంచి కార్తీక మాసోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న బుడ్డా శైలజ

బండిఆత్మకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓంకార క్షేత్రంలో ఈనె 2వ తేదీ నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో నాగప్రసాద్ అన్నారు. మంగళవారం వేల్పనూరులోని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సతీమణి బుడ్డా శైలజ చేత ఈవో ఆహ్వాన పత్రికలు విడుదల చేయించి, స్వామి వారి తీర్థప్రసాదాలు అర్చకుడు మల్లికార్జున అందజేశారు. కార్తీకమాసంలో కుటుంబ సమేతంగా ఓంకార క్షేత్రం విచ్చేయాలని ఈవో కోరారు. ఈర్నపాడు టీడీపీ నాయకులు ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, నారాయణ, సిబ్బంది నాగరాజు ఉన్నారు.

నేడు లక్ష బిల్వార్చన

నంద్యాల కల్చరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో మాసశివరాత్రి పురస్కరించుకొని కాశీవిశ్వేశ్వరస్వామివారికి ఉచిత లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్తీకమాస ఉత్సవాలలో భాగంగా 31న దీపావళి మహోత్సవం, లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకం, లక్ష్మీనారాయణ హృదయ హోమం, ధనలక్ష్మీపూజ, నవంబరు 15వతేదీన కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని సహస్రదీపాలంకరణసేవ, 23న అన్నాభిషేకం, 30న వెన్నాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయా నికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. మంగళవారం జూరాల నుంచి 29,312 క్యూసె క్కులు, సుంకేసుల నుంచి 11,072 క్యూసెక్కులు మొత్తం 40,384 క్యూసె క్కుల వరద వస్తోంది. సాయంత్రం 6 గంటల సమయానికి జలాశ యానికి 36,471 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడు గులు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటిమట్టం 882.90 అడుగు లకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎం సీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 203.8907 టీఎంసీలుగా నమోద యింది. ఏపీ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,064 క్యూసెక్కులు, తెలం గాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,600 క్యూసెక్కులు మొత్తం 67,664 క్యూసె క్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

కోడె దూడల వేలం ద్వారా రూ.8 .77 లక్షలు

మహానంది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని ఎంసీ ఫారం పశుపోషణ కేంద్రంలోని 52 ఒంగోలు జాతి కోడె దూడలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించగా రూ.8, 77, 000 ఆదాయం వచ్చినట్లు పశుపోషణ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ధర్మారావు తెలిపారు. పశుపోషణ కేంద్రం ఆవరణలో నిర్వహించిన కోడెదూడల వేలంలో పాల్గొనేందుకు రాయల సీమ జిల్లాలోని వందలాది మంది రైతులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఇందులో 13 ఆవులు, 21 మగదూడలు, 18 పెయ్య దూ డలను బహిరంగ వేలంలో దక్కించు కొన్నా రని తెలిపారు. ఈ వేలంలో కమిటీ సభ్యులు గా గుంటూరు లాం ఫామ్ నుండి శాస్త్రవేత్త ముత్తారావు, తిరుపతి వెంకటేశ్వర పశు పోషణ యూనివర్శిటీ శాస్త్రవేత్త శేషుబాబు, డాక్టర్ సాయిక్రిష్ణ, కె. శివజ్యోతి వ్యవహ రించారని తెలిపారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

పాణ్యం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆయుర్వేద దినోత్సవ సందర్భంగా మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుర్వేదం భారతీయ సంప్రదాయ వైద్యమని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర ఆయూష్ వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి అన్నారు. సీహెచ్‌సీ సూపరిండెంట్ డాక్టర్ రహేల, డాక్టర్ చంద్రప్రకాష్, డాక్టర్ మునిస్వామి, డాక్టర్ సునీల్, డాక్టర్ హరిశ్చంద్ర, సామాజిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పేషంట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

గడివేముల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బొల్ల వరం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న వీరునాయక్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు వీరునాయక్ సారా విక్రయిస్తుండగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతడి వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటరు జాబితాపై సమీక్ష

పాణ్యం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాణ్యం తహసీల్దారు కార్యాలయంలో వివిధ పార్టీల నాయ కులతో సమావేశం నిర్వహిం చారు. తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి మాట్లా డుతూ ఎవరైనా కొత్త ఓటరు నమోదు, పేరు, చిరునామా మార్పు, తొలగింపులు తదితర సమస్యలపై నవంబరు 28లోపు అర్జీలు ఇవ్వాలని తెలిపారు. డీటీ శివశంకర్, ఆర్‌ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత

- సరిగ్గా అందని సేవలు
- రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు, రైతులు



గడివేముల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో రెవెన్యూలో పనులు ముందుకు సాగడం లేదు. అవసరార్థులు తమ సమస్యలు పరిష్క రించుకునేందుకు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. మండలంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్, ఎలక్షన్ ఆపరేటర్, మండల సర్వేయర్, ఏఎస్‌వో, 14 మంది వీఆర్వోలు ఉండాల్సి ఉంది. సాధారణ బదిలీల్లో భాగంగా డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న గురునాథం బండి ఆత్మకూరుకు బదిలీకాగా రుద్రవరంలో పని చేస్తున్న రవీంద్ర ప్రసాద్ గడివేము లకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన రవీంద్ర ప్రసాద్ డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఏళ్ల తరబడి ఆర్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. మండలంలో 14 రెవెన్యూ గ్రామాలు ఉండగా చెనకపల్లె, దుర్వేశి రెవెన్యూ గ్రామాలకు వీఆర్వో పోస్టులను భర్తీ చేయలేదు. గని గ్రామ వీఆర్వో బాధ్యతలు చేపట్టిన అనంతరం సెలవుపై వెళ్లడంతో గ్రామంలోని రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఏఎస్‌వో పోస్టు ఖాళీగా ఉండడంతో పాణ్యం ఏఎస్‌వోకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

సకాలంలో జరగని పనులు

కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, గ్రామ సభలు, పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో వీఆర్వో, ఆర్‌ఐ, డీటీలది కీలక పాత్ర. ఆర్‌ఐ, డీటీ పోస్టులు ఖాళీగా ఉండడంతో ధ్రువీకరణ పత్రాలు విచారణ చేసేవారు లేక వాటిని మంజూరు చేయడంలో జాప్యం ఏర్పడుతోంది. ఖాళీగా ఉన్న పోస్టుల బాధ్యతలు ఇతరులపై పడుతుండడంతో పనులు సక్రమంగా జరగడం లేదు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రస్తుతం సభలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఈ సమావేశాలకు వెళ్తుండ డంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

– వెంకటరమణ, తహసీల్దార్

కార్యకర్తలకు అండగా టీడీపీ: ఎమ్మెల్యే



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీడీపీలో సభ్యత్వ సంఖ్యను పెంచడానికి నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. జిల్లాలోనే నందికొట్కూరు నియోజకవర్గంలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, లాయర్ జాకీర్, ముర్తుజావలి, షకీల్ అహ్మద్, వేణుగోపాల్, సురేంద్ర, ఆర్టు శ్రీనివాసులు, కుమార్, మీనాక్షి, వనజ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు చేయించారు. ఆయన మాట్లాడుతూ.. కేవలం వంద రూపాయలతో టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, నారాయణ, యుగంధర్, ప్రసాద్ పోల్‌రెడ్డి, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



మద్దూరులో సభ్యత్వ నమోదు చేయిస్తున్ననాయకులు

'ముంపు భూముల సమస్యను పరిష్కరించాలి'



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న ఏపీ సివిల్ సప్లైస్ డైరెక్టర్

నంద్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం గ్రామంలోని ముంపు భూము లకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని ఏపీ సివిల్ సప్లైస్ డైరెక్టర్ తలముడిపి మహేశ్ నాయుడు కలెక్టర్ రాజకుమారి గణియాను కోరారు. నంద్యాలలోని కలెక్టర్ చాంబ ర్‌లో మంగళవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. సిద్దేశ్వరం గ్రామానికి సంబంధిం చిన ముంపు భూముల సమస్యలను వివరించారు. అక్కడి భూ యజమానులను, సాగు చేసుకుంటున్న వారితో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ఈ విషయంపై ఇప్పటికే తనకు ఫిర్యాదులు అందాయని, వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలనకు వస్తామని చెప్పారు. తనకు తెలిసిన సమాచారం మేరకు పొలాలు ఏ ఒక్క రైతుకు చెందినవి కావని, పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని అన్నారు. ఏ ఒక్క వర్గానికి అనుకూలంగా వ్యవహరించ బోమని, సంబంధిత భూములను ఎవరైనా స్వాధీనం చేసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగా నాయకులు కూడా ఎవరికీ హామీలు ఇవ్వవద్దని ఆమె సూచించారు.

'భూ సమస్యల పరిష్కారానికి కృషి'

బండిఆత్మకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి వచ్చే భూ సమస్యలను సదస్సులు అయిన వెంటనే పరిష్కారం చేస్తామని తహసీల్దార్ ఆల్ఫ్రెడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పరమటూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. టీడీపీ నాయకులు కె.సాయిబాబారెడ్డి, శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయుడు, శేఖర్, నాగేశ్వరరెడ్డి, పరమేశ్వరెడ్డి, గోపాల్, డీటీ గురునాథం, మండల సర్వేయర్ పర్వీన్, వీఆర్వో మద్దిలేటి పాల్గొన్నారు.

మిడుతూరు: మాసపేట మజరా గ్రామం అయిన ఉప్పలదడియ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ సునీల్‌రాజు, ఆర్‌ఐ జహంగీర్ బాషా, వీఆర్వోలు సంజీవ్, సోఫి సాహెబ్, వీరా రెడ్డి, రాజ శేఖర్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని ముష్టపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రత్నరాధిక, సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

లలితా నగర్ స్థలం కుదింపును ఖండిస్తున్నాం

- మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కౌన్సిల్‌లో లలితానగర్‌లోని ప్రభుత్వ స్థలం కుదింపును మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఖండించారు. మంగళవారం తులసీవనంలోని భూమా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, అధికారుల తీరుపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మున్సిపల్ కౌన్సిల్‌లో లలితానగర్‌లో ప్రవేట్ వ్యక్తులకు మున్సిపల్ స్థలం కుదించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌన్సిల్‌లలో వైసీపీ సభ్యులు అధికంగా ఉండడంతో ప్రభుత్వ స్థలాన్ని ప్రవేట్ వ్యక్తులకు కుదించడం ప్రపంచంలోని వింతలలో కౌన్సిల్ ఆమోదం ఒక వింతగా ఉందని అన్నారు. టీడీపీ హయాంలో 80 అడుగుల రోడ్డు ఉన్న సమయంలో నిర్మాణాలు చేపట్టే సమయంలో అభ్యంతరం చెప్పడంతో నిలిపి వేసిన విషయాన్ని గుర్తుచేశారు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న 80 అడుగుల రోడ్డును 60 అడుగుల నుంచి ఇప్పుడు 30 అడుగులకు కుదించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థలం కుదింపులో డబ్బులు మారాయో, ఎందుకు కౌన్సిల్‌లో ఎందుకు ఆమోదం చేశారో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాతాలలో 30 అడుగులకు తక్కువ ఉన్న ప్రాంతాలలో అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టే అధికారులు ఈకుదింపు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తామని చెప్పే కమీషనర్ రేపు ఆక్రమణలు తొలగించడానికి జేసీబీలు ఎలా తీసుకెళతారని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఉడేందుకు ఎంత దూరమైనా వెళతామని హెచ్చరించారు. ఈసమావేశంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ మహబూబ్‌వలి, మాబువలి, భాస్కరరెడ్డి, నజీరా తదితరులు పాల్గొన్నారు.

'మెనూ పాటించాలి'

పగిడ్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని త్రిసభ్య కమిటీ సభ్యులు తహశీల్దార్ శివరాముడు, ఎంపీడీవో సుమిత్రమ్మ, ఎంఈవో సుబాన్ ఆదేశించారు.లక్ష్మాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న బోజనంను మంగళవారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాణసంచా దుకాణాల లొల్లి..!

- అనుమతుల్లేవంటూ దుకాణాల ఏర్పాటులో జాప్యం
- మండిపడుతున్న దుకాణాదారులు

నంద్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి దుకాణాల ఏర్పాటు విషయంలో అసలు ఏం జరుగుతోంది? అసలు అనుమతులు ఉన్న దుకాణాలు ఎన్ని? మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలెన్ని? అనే ప్రశ్నలకు సమాధానం దొరకని పరిస్థితి. టపాసుల దుకాణాల ఏర్పాటు విషయంలో ఓ నాయకుడు డబ్బులు వసూలు చేస్తున్నాడంటూ ఆంధ్రజ్యోతి 'దీపావళి వసూళ్లు' పేరిట మంగళవారం కథనాన్ని ప్రచురించింది. డబ్బులు వసూలు చేసి వ్యక్తి ఆయా శాఖలకు చలానాల రూపంలో చెల్లించాల్సిన డబ్బులు చెల్లించక పోవటంతో అధికారులు డిప్ ప్రక్రియను ఆలస్యం చేశారు. సేల్స్ టాక్స్ రూ.15 వేలు కట్టాలని, అపుడు గానీ డిప్ ప్రక్రియను మొదలుపెట్టబోమని అధికారులు తెలిపారు. ప్రతి ఏడు రూ.11 వేలు మాత్రమే కడుతున్నామని, ఈ ఏడు అధికంగా ఎందుకు కట్టాలని దుకాణాదారుల ప్రశ్నిస్తున్నారు. వాగ్వాదం అనంతరం డిప్ ప్రక్రియ మొదలుపెట్టినట్లు సమాచారం. ఇక్కడే ఓ ప్రశ్న తలెత్తుతోంది. వాస్తవానికి దేనికి ఎంత చలానా రూపంలో కట్టాలనే విషయం ఆయా శాఖల అధికారులు ముందుగానే నిర్ణయిస్తారు. అయితే వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అంతా తానే చూసుకుంటానని చెప్పి, రూ.38 వేలు దుకాణాదారుల దగ్గర దండుకోవటంతో, దుకాణాదారులు మిన్నకుండి పోయారు. అధికారులు మాత్రం నిబంధనల ప్రకారం ఈ ఏడాది రూ.15 వేలు కట్టాల్సిందేనని, అప్పుడే డిప్ ప్రక్రియ మొదలుపెట్టి దుకాణాలు కేటాయిస్తామని చెప్పారు. మళ్లీ రంగంలోకి దిగిన దందా రాయుడు పెంచిన రూ.4 వేలు కూడా దుకాణాదారుల నుంచి వసూలు చేశాడు. కొంతమంది ఇదేమిటని ప్రశ్నిస్తే తనకు తెలిసిన పెద్ద నాయకులతో ఫోన్ చేయిస్తున్నాడు. ఏటా దుకాణాల డబ్బులు వసూలు చేస్తున్న నాయకుడి తీరుతో అనుమతులు విషయంలో ఏదో ఒక ఇబ్బంది తలెత్తుతోంది. అయినా దుకాణాదారులు తననే ఆశ్రయించేలా ఏమి మతలబు చేస్తున్నాడు. ఇక డబ్బులు దండుకోవటమే కాకుండా దుకాణాల సంఖ్యలోనూ సదరు నాయకుడు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దాదాపు 73 దుకాణాలకు అనుమతి ఉండగా, దాదాపు 89 దుకాణాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పెరిగిన దుకాణాలను తనకు వెనుక ఉండి మద్దతు తెలుపుతున్న వారి మెహర్బానీ కోసం ఏర్పాటు చేసి ఇస్తున్నాడని సమాచారం. ఇటు దుకాణాల విషయంలోనూ, అటు దుకాణాదారులు నుంచి డబ్బులు వసూలు చేసే విషయంలోనూ సదరు నాయకుడు తనకు ఎదురు లేకుండా చూసుకుంటున్నాడు. ప్రతి ఏటా డబ్బులు దండుకుంటూ, దుకాణాదారులను ఇబ్బందులు పాలు చేస్తున్నాడు. ఇక అధికారులు సమన్వయ లోపంతోనూ ఇలాంటి వారి ఆటలు సాగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దుకాణాల ఏర్పాటులో అనుమతులు ఇచ్చే అన్ని శాఖలను ముఖ్య అధికారి సమన్వయం చేసుకోవాలి. దుకాణాదారులతో ముందుగానే సమావేశం ఏర్పాటు చేసి దుకాణాలను ఏర్పాటు చేయడానికి మధ్యవర్తులను ఎవరినీ సంప్రందించాల్సిన అవసరం లేదని, నియమ నిబంధనలను ప్రకారం నడుచుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబితే సరిపోయేది. కానీ అధికారుల సమన్వయం లేకపోవటం వల్లే కొంతమంది నాయకులు దళారులు అవతారమెత్తి డబ్బులు దండుకుంటున్నారు.

'త్వరలో కొత్త భవనాలు నిర్మిస్తాం'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): త్వరలో కొత్త భవనాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో శిథిలమైన పశువైద్యశాల, 22న పొంచి ఉన్న ప్రమాదం.. పెచ్చులూడుతున్న పాఠశాల భవనం పైకప్పు శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం దుద్యాల గ్రామంలో శిథిలమైన పశు వైద్యశాల, మండల పరిషత్ మెయిన్ పాఠశాల భవనాలను పరిశీలించారు. త్వరలో శిథిలమైన భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మిస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దుద్యాలలోని సూదిరెడ్డి నాగలక్ష్మిరెడ్డి సతీమణి సూదిరెడ్డి కృష్ణవేణమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.40లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు మల్లారెడ్డి, మన్సూర్ వలి, ఎండీ రఫీ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మంగళవారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయసూర్య హాజరై మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంగమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు రూ.4.50 కోట్లు నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం, రూ.55 లక్షలతో నూతన విద్యుత్ సౌకర్యం కోసం నిధులు మంజూరైనట్లు చెప్పారు. రూ.2.50 కోట్ల నిధులతో మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఎర్రమఠం, దుద్యాల గ్రామాల్లో 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పలు సమస్యలపై సీపీఎం నాయకుడు నక్కస్వాముల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, నారపురెడ్డి, లింగస్వామిగౌడు, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, విజయకుమార్, సుధాకర్, లింగన్న, జహరుల్లా, రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, బుచ్చిరెడ్డి, స్వామిరెడ్డి, డా.రాము, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పీ.మౌలాబీ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన మౌలాబీని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మౌలాబీ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు దేవానంద్, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పగిడ్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 43వ జూనియర్ ఖోఖో పోటీలలో పగిడ్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల హెచ్‌ఎం మదుసూదన్ తెలిపారు. పాఠశాలకు చెందిన గంగాదర్, చరణ్, భానుప్రియ ప్రతిభ చూపినట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు రషీద్ మియ్య, శైలజ కుమారి, పీడి కృష్ణ, క్రీడా శ్రీ పీతాంబరరెడ్డి ఉన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య బుక్ కీపర్ ఎన్నిక



వెలుగు కార్యాలయం వద్ద బందోబస్తు చేపట్టిన పోలీసులు

జూపాడుబంగ్లా, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీలోని రెండు వర్గాల నాయకులు బుక్‌కీపర్ ఎంపికలో జోక్యం చేసుకోవడంతో ఎస్‌ఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. జూపాడుబంగ్లాకు చెందిన 48 గ్రూపులు ఉండగా అందులో 33 గ్రూపులకు సంబంధించిన స్త్రీనిధి రుణాలు బ్యాంకులో చెల్లించకుండా బుక్‌కీపర్ జ్యోతి సొంతానికి వాడుకున్నారని పొదుపు మహిళల ఆరోపణల నేపథ్యంలో మెజార్టీ సభ్యుల తీరానంతో బుక్ కీపర్ పదవి నుంచి తొలగించడమే కాకుండా పోలీసుస్టేషన్‌లో డబ్బులు రికవరీ చేయాలని కేసు పెట్టారు. ఈనెల 5న ఒకసారి కొత్త బుక్‌కీపర్ ఎంపిక చేస్తుండగా గందరగోళం నెలకొంది. వాయిదా వేశారు. ప్రస్తుతం చేతులెత్తే పద్ధతిద్వారా సుమలతను ఎన్నుకున్నారు.

12 తీర్మానాలు ఆమోదం

ఆత్మకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మొత్తం 13 తీర్మానాల్లో 12 తీర్మానాలను ఆమోదించారు. ఇందిరానగర్, కప్పకుంట, అర్బన్‌కాలనీ ఏరియాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో జరిపే నిర్మాణాలకు సంబంధించి గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ.10వేలు, జీప్లస్-1 రూ.20వేలు, జీప్లస్-1కు రూ.10వేల చొప్పున వసూళ్లు చేయాలని నిర్ణయించారు. పలు కాలనీల్లో ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటుకు రూ.3లక్షలు, బట్టర్‌పై స్తంభాలకు రోప్ లైట్లకు రూ.1.5లక్షలు, 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రూ.19.5కోట్ల నిధులతో 14పనులకు ఆమోదం తెలిపారు. పాతబస్టాండ్ నందు గతంలో ఉన్న దుకాణ సముదాయాన్ని కూల్చివేసిన ప్రదేశంలో, వాటర్ ట్యాంకు సమీపంలో తాత్కాలిక దుకాణాలను తొలగించిన ప్రదేశంలో గుడ్‌విల్ పద్ధతిలో షాపులను నిర్మించి ఆతర్వాత మున్సిపాలిటీ నిర్ణయం మేరకు బాడుగల రూపంలో అద్దెలను వసూళ్లు చేసేలా తీర్మానించారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు రూ.6.5లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. కప్పలకుంటలో రెండు పాత మున్సిపల్ రూమ్‌లను కూల్చివేసి వాటి స్థానంలో పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంతో కలిసి మూడు రూమ్‌లను నిర్మించాలని తీర్మానించారు. వడ్లరామాపురం రస్తాలోని డంపింగ్ యార్డుకు వెళ్లేందుకు రూ.22లక్షలతో రహదారి ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా నంద్యాల టర్నింగ్‌లోని ఖబరస్తాన్ వరకు ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటుకు తీర్మానించారు. కాగా పాతబస్టాండ్‌లో ఇటీవల ఆక్రమణలను తొలగించిన ప్రదేశంలో రూ.3లక్షలతో వెట్‌మిక్స్ చదును చేసే పనులకు కౌన్సిల్ వారు అభ్యంతరం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రజలకు రక్షిత తాగునీరు


క్లోరినైజేషన్ ఇన్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

రుద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు రక్షి త తాగు నీరం దించేందుకే క్లోరినైజేష న్ ఇన్‌లైన్ ఏర్పాటు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్‌ఈ మనోహర్ అన్నా రు. మంగళవారం రుద్రవరంలో ఏర్పాటు చేసిన క్లోరినైజేషన్ ఇన్‌లైన్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఈ రవికుమార్, ఏఈ సుబ్రహ్మణ్యం, బ్రహ్మం తదితరులున్నారు.

గ్రామస్థులు ఆందోళన చెందొద్దు

- జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జగదీష్ చంద్రరెడ్డి

రుద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో డయేరియా కే సులు పెరగ కుండా చర్య లు తీసుకుం టున్నామని జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్‌చంద్రరెడ్డి అన్నారు. మంగళవారం రుద్రవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మరో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. ఇంకా ఎక్కువ కేసులు పెరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారులను విధులు నిర్వర్తించేందుకు డిప్యూటేషన్‌పై నియమిస్తున్నామన్నారు. మందులు కూడా కొరత లేకుండా చూశామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణి, జ్యోతి, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ స్థాపన మహోత్సవం


కలశ స్థాపన పూజలు చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సత్యమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో కలశ స్థాపన పూజలు వేద పండితుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాగణపతి, నవగ్రహ, యంత్రాభిషేకం, జలాదివాసం, రుద్రహోమం, అగ్నిప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు చేశారు. రజక సంఘం కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో హిందూ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం: ఎంపీడీవో

చాగలమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగనన్న లేఔట్‌లలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాలకు ఉపాధి పనిదినాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 31 నాటికి మిగిలిపోయిన పక్కా గృహాలు నిర్మించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీవో నిర్మల, హౌసింగ్ ఏఈ నరసింహరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బేతంచెర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల హుండీ ద్వారా రూ.17.30 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. మంగళవారం మద్దిలేటి స్వామి క్షేత్రంలో దేవాదాయశాఖ అధికారి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో స్వామి, అమ్మవార్ల హుండీలు లెక్కించారు. ఆలయ సిబ్బంది, వేద పండితులు, భక్తులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన సదస్సు

బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ తరుపున విద్యార్థులకు రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌సొసైటీ మండల చైర్మన్ సైఫుల్లా, హెచ్‌ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టండి

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

ఉయ్యాలవాడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టి పెట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు సూచించారు. మంగళవారం తుడుమలదిన్నె, మాయలూరు గ్రామాల్లో పర్యటించి ఆయిల్ పాం తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్ పాం తోటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఆసక్తి గల రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఆయన వెంట కోవెలకుంట్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి ధరణి, తుమ్మల ఆయిల్ పాం అధికారి అంజిబాబు, వీఏఏలు సుమలత, సరళ, జగన్ మోహన్, రైతులు పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించండి

ప్యాపిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికలో కంప చెట్లను తొలగించాలని ఊటకొండ గ్రామస్థులు కోరారు. ఏడాదిగా శ్మశానవాటికలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయన్నారు. దీంతో అంత్యక్రియలు నిర్వహించాలంటే ఇబ్బందిగా మారిందని ఊటకొండ వాసులు వాపోయారు. అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

2న రాష్ట్ర మంత్రుల రాక

ప్యాపిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న ప్యాపిలి మండలానికి పలువురు రాష్ట్ర మంత్రులు రానున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ తెలిపారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు బోయవాండ్లపల్లి కంబయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రులు ఎస్‌ఎండీ ఫరూక్, కందుల దుర్గేష్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్, టీజీ భరత్, సవితమ్మలతో పాటు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు ప్యాపిలికి రానున్నట్లు తెలిపారు. మండలంలోని వాల్మీకి గుహల దగ్గర మహర్షి వాల్మీకి విగ్రహ ఆవిష్కరణలో వారు పాల్గొననున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు వాల్మీకి సోదరులు హాజరుకావాలని వారు కోరారు.

దాతలకు సన్మానం


దాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని కొలుములపల్లె రోడ్డులో ఉన్న చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద నూతన కల్యాణ మండప నిర్మాణానికి సహకరించిన దాతలను దేవస్థానం కమిటీ సభ్యులు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ చలంరెడ్డి, పారిశ్రామికవేత్త శ్రీధర్ రెడ్డి, హుశేన్ రెడ్డి, మల్లు సుబ్బా రెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, చంద్రశేఖర్, గుండా గోపాల్, శేషఫణి, రామస్వామి, దాతలు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని చెరువు

- దెబ్బతిన్న అలుగు భాగం
- చెరువు కట్టపై భారీగా పెరిగిన కంపచెట్లు
- ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన జమ్ము
- సాగుకు నోచుకోని ఆయకట్టు భూములు
- పట్టించుకోని అధికారులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 29: మండలంలోని రూపనగుడి గ్రామ చెరువు అభివృద్ధికి నోచుకోవటం లేదు. గత 60 ఏళ్ల క్రితం 200 ఎకరాల విస్తీర్ణంలో దాదాపుగా 300 ఎకరాలకు సాగునీరు అందించే ప్రధాన లక్ష్యంతో చెరువును నిర్మించారు. ప్రస్తుతం చెరువు పరిస్థితి అధ్వానంగా మారింది. చెరువు లోపలి భాగంలో జమ్ము పేరుకపోయి పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండటంలేదు. 2018-19లో వరల్డ్ బ్యాంక్ ద్వారా రూ. 1.50 కోట్ల నిధులు మంజూరమయ్యాయి. ఈ నిధులతో తూము భాగం, 500 మీటర్ల మేర చెరువు కట్ట బలోపేతం, 1250 మీటర్ల మేర పంట కాలువలను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. గత ఐదేళ్లుగా నిధులు మంజూరు కాకపోవటంతో చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. చెరువు తూము చుట్టూ, చెరువు కట్టపై ముళ్ల చెట్లు అల్లుకపోయ్యాయి. చెరువు లోపలి భాగంలో జమ్ము పేరుకపోయింది.


జమ్ముతో నిండిన చెరువు లోపలి భాగం


తూము చుట్టూ అల్లుకపోయిన కంపచెట్లు

చెరువులో పూడిక తీయకపోవటంతో భూభాగం అంతా మట్టితో నిండిపోగా నీటినిల్వ సామర్థ్యము తగ్గిపోయింది. ఆ భాగంలో మాయలూరు, గోవిందపల్లె గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. చెరువు అలుగు భాగం పూర్తిగా దెబ్బతింది. అలుగు బయటి భాగంలో ఏర్పాటు చేసిన సిమెంట్ లైనింగ్ నీటి ప్రవాహానికి దెబ్బతినింది. అలుగు వద్ద జమ్ముగడ్డి పేరుకపోయి నీటి ప్రవాహానికి ఆటకంగా మారింది. అలుగు కుడివైపు సపోటువాలు దెబ్బతిన్నది. చెరువు ఆయకట్టు ప్రధాన కాలువల్లో జమ్ము పేరుకపోవ డంతో నీరు ముందుకు పోవటం లేదు. పంట కాలువలు సరిగా లేకపోవటంతో రైతులు పూర్తి స్థాయిలో వరి పంట సాగుచేయలేక పోయారు. చెరువును, పంట కాలువలను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు

2018-19 నుంచి చెరువు అభివృద్ధిని నిధులు మంజూరు కాలేదు. 2023-24లో ఫడ్ డెవలప్‌మెంట్ కింది రూ. రెండు లక్షలు నిధులు అవసరమయినట్లు ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరుకు ఆ నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు అయితే చెరువు అభివృద్ధి పనులు చేస్తాం.

- రామ్‌ప్రసాద్, ఏఈ, మైనర్ ఇరిగేషన్

వాటర్‌ప్లాంట్ పునరుద్ధరించాలి

- రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


అవుకు మెట్ట వద్ద మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ కక్ష పూరిత రాజకీయాల వల్ల మూతపడ్డ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పునరుద్ధరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం అవుకు మెట్ట మూతపడ్డ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే సంకల్పంతో ఈ ప్లాంట్‌ను తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ కక్షపూరిత రాజకీయాల కారణంగా నిరుపయోగంగా మారిందన్నారు. ప్లాంట్‌కు అవసరమైన మరమ్మతులు చేయించి తిరిగి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తామని అవుకు మెట్ట వాసులకు మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సాయికృష్ణ, అవుకు మెట్ట సమీపంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.30లక్షలు డ్వాక్రా మహిళల విరాళం

సీఎం రిలీఫ్ ఫండ్‌కు డాక్రా మహిళలు రూ. 30లక్షలు విరాళం అందజేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి బనగానపల్లెలో డీఆర్ డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఈ నిధులను వినియోగించాలని పీడీ మంత్రినికోరారు.

పరిశ్రమలకు కూటమి ప్రభుత్వం అనుకూలం

కొలిమిగుండ్ల : ఏపీలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అనుకూలంగా ఉంటుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల మండలకేంద్రలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమను మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు మంత్రి దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇటీవలే వివాహం జరిగిన యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు కుమారులు డా.సాయిశివ జయంత్ దంపతులను ఆశీర్వదించారు.

మేధస్సును పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు

● డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి


విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న న్యాయాధికారి తంగమణి, డీఈవో జనార్దన్ రెడ్డి

డోన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు మేధో సంపత్తిని పెంచుకోవడం వల్ల మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని డా.బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జోనల్ సైన్స్‌ఫేర్ ముగిసింది. విద్యార్థినులు తయారు చేసిన ప్ర దర్శనలను వారు తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పి స్తున్న అనేక అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని అనుకున్న లక్ష్యా లకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు డీసీవో శ్రీదేవి, అనంతపురం డీసీవో ఉదయశ్రీ, డోన్ పాఠశాల ప్రిన్సిపాల్ గీత, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర స్థాయికి 16 ప్రదర్శనలు ఎంపిక

పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జోనల్ సైన్స్‌ఫేర్‌లో మొత్తం 73 పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. సైన్స్‌ఫేర్‌లో విద్యార్థినులు తయారు చేసిన 16 ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో వెల్దుర్తి గురుకుల పాఠశాలకు చెందిన మూడు ప్రదర్శనలు, కంబళపాడు పాఠశాల ఒక ప్రదర్శన, డోన్ పాఠశాల ఒక ప్రదర్శన, దిన్నెదేవరపాడు పాఠశాల ఒకటి, లక్ష్మీపురం పాఠశాల ఒక ప్రదర్శనతో పాటు అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన పాఠశాలలకు సంబంధించి 9 ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఎంపికైన విద్యార్థినులకు మెమెంటోతో పాటు సర్టిఫికెట్లను డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి, డీఈవో జనార్దన్ రెడ్డి అందజేశారు. సైన్స్‌ఫేర్‌ను ఆహ్లాదకరమైన వాతావారణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ గీతను అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి

బేతంచెర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయా వార్డుల కౌన్సిలర్లు కోరారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి అధ్యక్ష తన కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా కార్యాలయ సిబ్బంది అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భం గా 12వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి మాట్లాడు తూ మంగళగిరి ప్రాంతంలోని ప్రజలు తాగు నీటి సమస్యతో అల్లాడిపోతున్నారని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. సంజీవన గర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేవని మరమ్మతులు చేపట్టాలని కోరారు. 11వ వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు దుర్గాపేట సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద నీటి తొట్టి ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్, చైర్మన్లు వివరించారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

చాగలమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వంగలి గ్రామ ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదోతరతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. సహచర మిత్రులు గొడిగనూరు వెంకటేశ్వర్లు కుమార్తె వివాహానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మరో మిత్రుడు పెద్దవంగలి మహబూబ్‌బాష మరణానంతరం వారి కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

చాగలమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగ నేతాజీ అన్నారు. మంగళవారం చింతలచెరువు, డి.వనిపెంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్‌ఏ, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జన్దాన్‌రెడ్డి సూచించారు. మంగళవారం నంద్యాల ఆర్డీవోగా నియమితులైన చల్లా విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా బనగానపల్లెలో మంత్రిని కలిశారు. ప్రజలు, రైతులకు సంబంధించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గడివేముల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బొల్లవరం గ్రామంలో నాటుసారాను విక్రయిస్తున్న వీరునాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు వీరునాయక్ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్

సంజామల, అక్టోబరు 29: ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటలకు సర్పంచులు మంచాల వీరప్రతాప్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, వెంకటయ్య, అరుణ కుమారి, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. కోరం లేకపోవడంతో ఎంపీడీవో సాల్మన్ సమావేశాన్ని నిర్వహించలేకపోయారు. గంట తరువాత ఆర్.లింగందిన్నె, గిద్దలూరు ఎంపీటీసీ సభ్యులు రావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. సభలో ఏవో సుధాకర్ రెడ్డి, ఏపీవో సూర్యప్రకాష్, ఎంఈవో ఈశ్వరయ్య, విద్యుత్, వైద్యం, ఐసీడీఎస్ అధికారులు నివేదికలు సభకు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ అనిల్ కుమార్, సీడీపీవో సుబ్బలక్ష్మమ్మ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కలుగొట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 73 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రవిరెడ్డి అనే వ్యక్తి కోవెలకుంట్ల పట్టణంలో ఓ మద్యం దుకాణంలో మద్యం బాటిళ్ల కొనుగోలు చేసి తీసికెళ్తుండగా అతన్ని అదుపులోకి తీసుకుని మద్యం బాటళ్ల స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలి

కోవెలకుంట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ పొందాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని యల్లంపాడు, లింగాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, లింగాల నాయుడు, ఏడీఏ సుధాకర్, వ్యవసాయసిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

డోన్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి మంగళవారం స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్‌బాబు, పోలీసులు ఉన్నారు.

'వీవోఏలపై వేధింపులు ఆపాలి'

బేతంచెర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీవోఏలపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని వీవోఏల మండల కార్యదర్శి వెంకటరమణ కోరారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, వీవోఏలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు విరాళం

బేతంచెర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు వాటర్ ట్యాంకును రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుల్లయ్య, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సభ్యులు మాణిక్యంశెట్టి, రామ్మూర్తి, మక్బూల్ హుశేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సు

రుద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూరీసర్వే జరిగిన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దారు మల్లిఖార్జునరావు అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో భూరీసర్వే గ్రామసభ నిర్వహించారు. 130 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయన్నారు. వాటిని పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయరు రమణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పశుగణన పకడ్బందీగా చేయాలి

చాగలమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఎన్యూమరేటర్లు పశుగణన పకడ్బందీగా చేయాలని పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల పాటు ఇంటింటికి వెళ్లి పశుగణన చేయాల్సి ఉంటుందని అన్నారు. 11 మంది ఎన్యూమరేటర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లు, పశు వైద్యాధికారులు కొనసాగుతారని తెలి పారు. పశుగణన వాల్ పోస్టర్లను విడుదల చేశామన్నారు. పశుగణనపై సిబ్బందికి అవగాహన కల్పిస్తామని అన్నారు. కార్యక్ర మంలో వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ జలుబు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని అన్నారు. డెంగీ వ్యాధిపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

హుండీ లెక్కింపు

బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి హుండీని మంగళవారం లెక్కించారు. ఆలయానికి రూ.44,25,787 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో చంద్రుడు మంగళవారం తెలిపారు. బంగారు, వెండి ఆభరణాలు హుండీ లెక్కింపులో రాలేదని ఈవో చంద్రుడు తెలిపారు. దేవాదాయశాఖ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి, మౌళీశ్వరరెడ్డి, పూజారి మహేశ్‌శర్మ, సత్యనారాయణశర్మ భక్తులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయండి

కొలిమిగుండ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వచ్చెనెల 2న ప్యాపిలి మండలంలోని బోయవాండ్లపల్లి వద్ద ప్రసిద్ధ వాల్మీకి గుహల ఆవరణంలో జరగనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వాల్మీకి సోదరులు విజయవంతం చేయాలని బోయ కంబగిరిస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన వాల్మీకి సంఘం సభ్యులు కరపత్రాలు పంపిణీ చేశారు.

స్టడీమెటీరియల్ అందజేత

బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు టీడీపీ నాయకుడు రాజగోపాల్, ఆయన కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరిల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి , ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, కుమార్ బాబు, రామచంద్రారెడ్డి, కృష్ణయ్య ,సుబ్బరాయుడు మధుసూధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేంద్ర, రాము,రషీదాబేగం, సుశీల, నూర్‌భాష పాల్గొన్నారు.

ఘనంగా భరద్వాజ జయంతి

డోన్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం గుత్తి రోడ్డులో ఉన్న పొలికి వరచితంబరస్వామి ఆలయంలో మంగళవారం అవధూత మాస్టర్ భరద్వాజ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భరద్వాజ చిత్రపటానికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానం దాచారి అన్నారు. మంగళవారం పలుకూరు గ్రామంలో ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చేతి సంచులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, చాకలి బాలన్న, శ్రీనివాసులు, లక్ష్మన్న, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొలిమిగుండ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ అధికారి ప్రకాశ్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 22న 'గ్రంథాలయానికి గ్రహణం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన జిల్లా అధికారి కొలిమిగుండ్లలో భవనాన్ని పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు. స్థలం కోసం రెవెన్యూ అధికారులను సంప్రదిస్తున్నామని, స్థలం కేటాయిస్తే నూతన భవనాన్ని నిర్మించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామ పంచాయతీలు గ్రంథాలయ సెస్సును చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్థానిక లైబ్రేరియన్ రాజామనోహర్, రిటైర్డ్ లైబ్రేరియన్ మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.